

సీఆర్‌టీల రెన్యువల్

సీతంపేట రూరల్, జూలై25(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ పరిధిలోని గిరిజనసంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌టీ(కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్స్)లను రెన్యువల్ చేసినట్లు గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు అన్నదొర చెప్పారు. శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. ఐటీడీఏ పరిధిలోని శ్రీకాకుళం జిల్లాలో పనిచేస్తున్న 121 మందితో పాటు ప్వార్వతీపురం మన్యం జిల్లాలో పనిచేస్తున్న మరో 89మంది సీఆర్‌టీలను రెన్యువల్ చేస్తు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. ఈ మేరకు వారి సేవలను అన్ని పాఠశా లల్లో ఉపయోగించుకుంటామని వెల్లడించారు.

శ్రావణ శోభ

- ఆలయాల్లో పూజలు
- ప్రత్యేక అలంకరణల్లో అమ్మవార్లు



సాలూరు : కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

పాలకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శ్రావణ సందడి మొదలైంది. అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక అలంకరణల్లో అమ్మవార్లను దర్శించుకుని పులకించిపోయారు. శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాలకొండ కోటదుర్గమ్మ ఆల యంలో విశేష పూజలు, అర్చనలు చేశారు. ఈవో వీవీ సూర్యనారాయణ పర్యవేక్షణలో ప్రధాన అర్చకుడు లక్ష్మీ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో లక్ష కుంకుమార్చన, లలిత సహస్రనామ పారాయణం తదితర పూజలు ఘనంగా నిర్వహించారు. పలువురు చిన్నారులకు అక్షరాభాస్యాలు, నూతన వాహనాలకు పూజలు చేపట్టారు. సామూహిక పూజల్లో 1500 మంది భక్తులు పాల్గొన్నారు.





పాలకొండ : పూజలందుకున్న కోటదుర్గమ్మ, పూజల్లో మహిళలు

తోటపల్లిలో...

గరుగుబిల్లి: ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధి గాంచిన తోటపల్లి వేంకటేశ్వర, కోదండ రామస్వామి దేవస్థానాల్లో శుక్రవారం విశేష పూజలు, హోమాలు, అర్చనలు చేశారు. పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఇన్‌చార్జి ఈవో సూర్యనారాయణ ప్రసాదాలు అందించారు.

సాలూరులో..

సాలూరు/రూరల్: పట్టణంలోని కామాక్షి, వాసవీ కన్యకాపరమేశ్వరి తదితర ఆలయాల్లో వైభవంగా పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. కామాక్షీదేవితో పాటు సంతోషిమాత భక్తులకు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు.



సాలూరు : ప్రత్యేక అలంకరణలో కామాక్షి దేవి

సారా హోరు.. బెల్టు జోరు!





- సీతంపేట మన్యంలో ఎక్కిడికక్కడే దుకాణాలు
- పుట్టగొడుగుల్లా వెలుస్తున్నవైనం
- గిరిజన గ్రామాల్లో యథేచ్ఛగా విక్రయాలు
- ఒక్కో బాటిల్‌పై రూ.50 వరకు అదనంగా వసూలు
- పట్టించుకోని ఎక్సైజ్‌శాఖ

సీతంపేట రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): సీతంపేట మన్యంలో ఎక్కడికక్కడే బెల్ట్ షాపులు వెలుస్తున్నాయి. నాటుసారా విక్రయాలు కూడా జోరుగా సాగుతున్నాయి. మూడు పూలు.. ఆరు కాయలు అన్న చందంగా వాటి వ్యాపారాలు సాగుతున్నాయి. గిరిజన గ్రామాల్లో బహిరంగంగానే మద్యం, నాటుసారా విక్రయాలు జరుగుతున్నా.. ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరి స్తున్నారు. దీంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అధిక ధరలకు అమ్మకాలు చేపట్టి లాభాలు ఆర్జిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

సీతంపేట మండలంలో 25 వరకు బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. ప్రధానంగా మానాపురం, కొత్తకోట, పొల్ల, దోనుబాయి, గాడిదపాయి, కిల్లాడ, పూతికవలస, చినబగ్గ, మర్రిపాడు, జామితోట, గొయిది, కుసిమి, కోడిశ, కిండంగి, కుడ్డపల్లి, జగ్గడుగూడ సెంటర్‌తో పాటు మరికొన్ని చోట్ల బెల్ట్ దుకాణాలు ఉన్నాయి. రాత్రి వేళల్లో గుట్టు చప్పుడు కాకుండా సీతంపేటలోని మద్యం దుకాణాల నుంచే నేరుగా ఆయా షాపులకు ఆటోల్లో మద్యం బాటిళ్లను సరఫరా చేస్తున్నారు. దీంతో బెల్టు నిర్వాహకులు గ్రామాల్లో యథేచ్ఛగా విక్రయాలు జరుపుతున్నారు.



బెల్ట్‌షాప్‌లకు ఆటోలో మద్యం బాటిళ్లను తరలిస్తున్న దృశ్యం (ఫైల్)

జోరుగా అమ్మకాలు

ఒక్క సీతంపేటలోనే ఏడు వరకు బెల్టు షాపులున్నాయి. ఫాస్ట్‌ఫుడ్, కిరాణా, టిఫిన్ సెంటర్లలో యథేచ్ఛగా మద్యం విక్రయిస్తున్నారు. ఒక్కో మద్యం బాటిల్‌పై రూ.30 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. తెల్లవారు జాము నుంచి అర్ధరాత్రి 12గంటల వరకు బెల్టు దుకాణాల్లో అమ్మకాలు జరుగుతున్నాయి. ఇకపోతే గొలుసు దుకాణాలకు పోటీగా నాటుసారా

(మిగతా 8వ పేజీలో...)

నీకు అక్కాచెల్లెళ్లు లేరా?

- ఈవ్‌టీజింగ్ చేసిన యువకునికి బుద్ధి చెప్పిన విద్యార్థిని

పాలకొండ, జూలై 25(ఆంధ్రజ్యోతి): పాలకొండలో శుక్రవారం ఈవ్‌టీజింగ్‌కు పాల్పడిన యువకుడికి ఓ విద్యార్థిని ధైర్యంగా బుద్ధి చెప్పింది. వేరే గ్రామం నుంచి ఓ బాలిక పాలకొండలోని ఓ కళాశాలకు విద్యాభ్యాసం కోసం రోజూ వస్తోంది. ఈ విద్యార్థినిని ఓ యువకుడు పాలకొండ బస్టాండ్‌లో ఈవ్‌టీజింగ్ చేసేందుకు ప్రయత్నం చేశాడు. దీన్ని ఆ విద్యార్థిని తిప్పికొట్టింది. ధైర్యంగా యువకుడి వద్దకు వెళ్లి ఈవ్‌టీజింగ్ చేస్తే చెప్పుతో కొడతానని బదులిచ్చింది. 'నీకు అక్కాచెల్లెళ్లు లేరా' అని ప్రశ్నించింది. దీంతో చేసేదిలేక ఆ యువకుడు అక్కడి నుంచి జారుకున్నాడు. ఆ విద్యార్థిని ధైర్యానికి అంతా శభాష్ అని మెచ్చుకున్నారు. పాలకొండకు విద్యాభ్యాసం కోసం వేలాది మంది విద్యార్థులు బస్సుల్లో రాకపోకలు సాగిస్తున్నారు. దీనిపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి ఈవ్‌టీజింగ్ పాల్పడిన వారిపై కఠినంగా వ్యవహరించాలని విద్యార్థినుల తల్లిండ్రులు కోరుతున్నారు. ఇదిలా వుంటే విద్యార్థినిని ఈవ్‌టీజింగ్ చేసిన యువకుడు ఎవరని పోలీసులు ఆరా తీస్తున్నారు.



యువకుడికి బుద్ధి చెబుతున్న విద్యార్థిని

పక్కాగా ఇంటింటి సర్వే: డీఎంహెచ్‌వో

సీతానగరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పక్కాగా ఇంటింటి సర్వే నిర్వ హించి జ్వర పీడితులను గుర్తించాలని డీఎంహెచ్‌వో భాస్కర రావు ఆదేశించారు. లక్ష్మీపురంలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో జ్వరాలు తగ్గుముఖం పట్టే వరకు వైద్య శిబిరం కొనసాగించాలని సిబ్బందికి సూచించారు. ఎటువంటి కేసులు వచ్చినా వెంటనే చూడాలన్నారు. పారిశుధ్యం లోపం కారణంగా అక్కడ క్కడా ఫీవర్స్ ప్రబలుతున్నాయని, ఇవి కేవలం సీజనల్ జ్వరాలేనని వెల్లడించారు.



కేసుల వివరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

ఉపాధిలో అవినీతికి చెక్

- నిబంధనలు కఠినతరం
- పని ప్రదేశంలో రెండు విడతల హాజరు నమోదు
- శ్రామికుల ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్

6లో

అన్నదాతల్లో ఆనందం

- ఆశాజనకంగా వర్షాలు
- ముమ్మరంగా వ్యవసాయ పనులు



6లో

గుడ్డుతో పోషకాహారం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

6లో

తోటపల్లికి స్వల్ప వరద

గరుగుబిల్లి, జూలై 25(ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో శుక్రవారం స్వల్పంగా వరద ప్రవాహం పెరిగింది. గత మూడు రోజులుగా పైప్రాంతం ఒడిశాతోపాటు జిల్లాలోనూ వర్షాలు కురుస్తుండడంతో నదిలోకి 3,720 క్యూసెక్కుల వరద చేరింది. దీంతో శుక్రవారం ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమై స్పిల్‌వే గేట్లు నుంచి దిగువ ప్రాంతాలకు 3,044 క్యూసెక్కులను విడుదల చేశారు. ఖరీఫ్‌కు సంబంధించి కుడి ప్రధాన కాలువ నుంచి 850 క్యూసెక్కులు, పాత రెగ్యులేటర్ పరిధిలోని కాలువల నుంచి 260 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 105 మీట ర్లకు గాను ప్రస్తుతం 103.7 మీటర్ల స్థాయికి నీరు చేరిందని ప్రాజెక్టు ఈఈ హెచ్.మన్మథ రావు తెలిపారు. 2.534 టీఎంసీలకు గాను 1.791 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు వెల్లడించారు. వర్షాల కారణంగా నదీ తీర ప్రాంతాల్లో ఎవరూ చేపల వేటకు వెళ్లరాదని తహసీల్దార్ బాల, ఎంపీడీవో పైడితల్లి ఆదేశాలు జారీ చేశారు



స్పిల్‌వే గేట్లు నుంచి దిగువకు నీటిని విడుదల చేసిన దృశ్యం

పార్వతీపురంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్

- క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి హామీ
- రూ.8 కోట్లు మంజూరు చేస్తామని వెల్లడి

వచ్చేనెలలో రెండు సంక్షేమ పథకాలు

- ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి

8లో

పేదరిక నిర్మూలనకు కృషి

- అంకిత భావంతో పనిచేయాలి
- కలెక్టర్లకు పీ-4పై దిశానిర్దేశం చేసిన సీఎం చంద్రబాబునాయుడు

పార్వతీపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులతో పాటు కలెక్టర్, ఇతర అధికారులు అంకితభావంతో పని చేయాలని, పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని సీఎం చంద్రబాబునాయుడు సూచించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా జీరో పావర్టీ పీ-4పై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని ఆ ప్రాంతానికి చెందిన ఎన్‌ఆర్‌ఐలు, పారిశ్రామికవేత్తలు స్థానిక బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేలా చూడాలన్నారు. ఈ ప్రక్రియ ఆగస్టు 10లోగా పూర్తి చేయాలన్నారు. 15 నాటికి బంగారు కుటుంబాలను మార్గదర్శులు దత్తత తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ , జేసీ శోభిక, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబునాయుడు, కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

టార్గెట్ 2027

- భూముల రీసర్వే పూర్తికి ప్రభుత్వ నిర్ణయం
- జాయింట్ ఎల్‌పీఎంలు సరిచేసేందుకూ గడువు పెంపు



కొమరాడ మండలంలోని ఓ గిరిజన గ్రామంలో రీ సర్వే ప్రక్రియ పరిశీలిస్తున్న ఏడీ (ఫైల్)

జియ్యమ్మవలస, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియ పూర్తికి ప్రభుత్వం 2027, డిసెంబరు 31 వరకు గడువు విధించింది. ఎటువంటి తప్పిదాలు లేకుండా ప్రక్రియ చేపట్టాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. ఈ మేరకు జిల్లా అధికారులు సన్నద్ధమవుతున్నారు. సెప్టెంబరు 15 నాటికి ఫీల్డ్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ (ఎఫ్‌పీఓఎల్‌ఆర్)ను గ్రామ రెవెన్యూ అధికారులు సిద్ధం చేయాల్సి ఉంది. గ్రామాల్లో భూముల సరిహద్దును ఆగస్టు 5లోగా గ్రామ సర్వేయర్లు నిర్ణయించాలి. అదేవిధంగా నవంబరు 30లోగా ప్రభుత్వ భూముల పరిధిని తేల్చాలి. ఇదిలా ఉండగా.. జాయింట్ ఎల్‌పీఎంల ఆన్‌లైన్ సేవలకు కూడా ప్రభుత్వం ఈ ఏడాది డిసెంబరు 31 వరకు గడువు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈ గడువు జూన్ 30 వరకు ఉండేది. అయితే జిల్లాలో జాయింట్ ఎల్‌పీఎంలు సంఖ్య 14,514 వరకూ ఉన్నాయి. వాటిలో పాలకొండ డివిజన్‌లో 4,958, పార్వతీపురం డివిజన్‌లో 9,556 ఉన్నాయి. గతంలో జాయింట్ ఎల్‌పీఎంల సరిచేసేందుకు వైసీపీ ప్రభుత్వం రూ. 500లు వసూలు చేసేది. అయినా సమస్య పరిష్కారం కాలేదు. కూటమి ప్రభుత్వం మాత్రం రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని కేవలం రూ. 50తో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులబాటు కల్పించింది.

ఇదీ భౌగోళిక పరిస్థితి

జిల్లాలో పాలకొండ, పార్వతీపురం డివిజన్ల పరిధిలో 15 మండలాలు, 965 గ్రామాలు ఉన్నాయి. జిల్లాకు తూర్పున శ్రీకాకుళం, పడమర, ఉత్తర దిక్కుల్లో ఒడిశా రాష్ట్రం, దక్షిణాన విజయనగరం జిల్లా సరిహద్దులుగా ఉన్నాయి. మన్యంలో మొత్తంగా 5,78,016.39 ఎకరాల్లో రీ సర్వే చేయాల్సి ఉంది. కాగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వే తప్పులు తడకలుగా మారింది. దీనికితోడు

(మిగతా 8వ పేజీలో...)

శ్రావణ కళ


విజయనగరం: పైడితల్లిని దర్శించుకుంటున్న భక్తులు

● ఆలయాల్లో ప్రత్యేక పూజలు

విజయనగరం కల్చరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం తొలి శుక్రవారం జిల్లాలోని వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. శుక్రవారం తెల్లవారు జాము నుంచి అభిషేకాలు, విశిష్ట పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజయనగరంలోని పైడిమాంబ ఆలయ ప్రాంగణాన్ని పూలతో సుందరంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో శిరీష ఆలయ ప్రాంగణంలో ఉండి... దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా చూశారు. దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. వచ్చే నెల 22 వరకూ పైడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని తెలిపారు. ప్రతి మంగళవారం పంచామృతాభికం, ప్రతి శుక్రవారం విశిష్టకుంకుమార్చనతో పాటు శ్రావణ పౌర్ణిమ రోజున స్వర్ణ పుష్పాలతో పూజించనున్నట్టు తెలిపారు.


మక్కువ: కోటదుర్గమ్మ పూజల్లో పాల్గొన్న మహిళలు


వీరఘట్టం: కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


నెల్లిమర్ల: రామతీర్థంలో మహాలక్ష్మికి పూజలు చేస్తున్న దృశ్యం


చీపురుపల్లి: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు




భామిని: సంతోషిమాత ఆలయంలో..

శాకంబరిగా దుర్గామాత

శృంగవరపుకోట, జూలై 25(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట శ్రీదేవి (దుర్గా) మాత శాకంబరిగా భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణ మాసం మొదటి శుక్రవారం కావడంతో ఆలయ నిర్వాహలు వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.


చీపురుపల్లి: పసుపు కొమ్ముల అలంకరణలో...


భామిని: ఉజ్జాపనలు చేస్తున్న భక్తులు

కనకదుర్గకు పసుపు కొమ్ములతో అలంకరణ

చీపురుపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం మొదటి శుక్రవారం సందర్భంగా శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు. అమ్మవారి ఆలయంలో పట్టణానికి చెందిన భక్తులు ప్రత్యేకంగా కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో బి.శ్రీనివాస్, అర్చకులు ఆరవిల్లి రవికుమార్, ఆలయ కమిటీ చెర్మన్ గవిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల్లో ఆనందం

● ఆశాజనకంగా వర్షాలు

● ముమ్మరంగా వ్యవసాయ పనులు

రాజాం రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు అన్నదాతల్లో ఆనందాన్ని నింపుతున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం పుణ్యమాని.. రైతన్న పొలం బాట పట్టాడు. చెరువులు నిండుతుండడం... పొలాల్లో కూడా ఉభాలకు సరిపడినంతగా నీరు చేరడంతో ఓవైపు ట్రాక్టర్లతో పొలాలను సిద్ధం చేస్తూ మరోవైపు ఆకుతీత, నాట్లువేసే పనుల్లో తలమునకలవుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచే రైతులు పొలం పనుల్లో బిజీగా కనిపించారు. ఇదిలా ఉంటే శుక్రవారం మధ్యాహ్నం సైతం ఏకధాటిగా వర్షం కురియడంతో రైతుల్లో ఉత్సాహం రెట్టింపయ్యింది. ఉపాధి హామీ పనులు జోరుగా సాగుతుండడంతో కూలీలు దొరకని పరిస్థితి తలెత్తింది. దీంతో వ్యవసాయ పనుల్లో రైతులు కుటుంబ సభ్యులతో కలసి పాల్గొనాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. మండలంలోని దోసరి, రామినాయుడువలస, గడిముడిదాం, పెనుబాక, బొద్దాం, నందబలగ, లక్ష్మీపురం, కొరారిపురం, శ్యాంపురం, అంతకాపల్లి, వి.ఆర్.అగ్రహారం తదితర గ్రామాలలో శుక్రవారం ఉభాలు ప్రారంభమయ్యాయి. శనివారం నుంచి ఈ పనులు మరింత జోరందుకునే పరిస్థితులు కనిపిస్తున్నాయి.


నారును తరలిస్తూ...


అంతకాపల్లి సమీపంలో పొలాన్ని సిద్ధం చేస్తున్న దృశ్యం


వీఆర్అగ్రహారంలో నారు తీస్తున్న రైతు

గుడ్డుతో పోషకాహారం

● పొదుపు మహిళలకు ఎగ్ కార్డుల పంపిణీ

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం, జూలై 25(ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపం నివారణకు ప్రతి ఒక్కరూ రోజూ గుడ్లు తినాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. కోడిగుడ్లు తినడం ద్వారా ప్రోటీన్ లభిస్తుందన్నారు. 10మంది పొదుపు సంఘాల మహిళలకు రూ.50 వేల విలువైన ఎగ్ కార్డులను స్థానిక టీటీడీసీ మహిళా ప్రాంగణంలో శుక్రవారం మంత్రి శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ ఎగ్ కార్డుల ద్వారా గుడ్లతో తయారు చేసిన వివిధ ఆహార పదార్థాలను విక్రయించనున్నారు. నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (ఎన్ఈసీసీ) రాష్ట్రంలో వెయ్యి మందికి ఎగ్‌కార్డులను పంపిణీ చేస్తోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పోషకాహార లోపం కనిపిస్తోందని... గుడ్లను వినియోగించడం ద్వారా లోపం నుంచి బయట పడవచ్చునన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ కె.సావిత్రి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మి, స్త్రీనిధి మేనేజర్ కృష్ణంనాయుడు, డీపీఎం రాజ్‌కుమార్, ఎన్ఈసీ జోనల్ చైర్మన్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.


గుడ్లు విక్రయించే స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్

కార్పొరేషన్ పరిధిలో ఆటో మ్యుటేషన్

విజయనగరం రింగురోడ్డు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థ పరిధిలో ఆస్తుల ఆటో మ్యుటేషన్ అమలు కానుంది. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య తెలిపారు. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అడ్మిన్ కార్యదర్శులకు ఆయన ఆదేశించారు. శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్బన్ ఆస్తుల ఆటో మ్యుటేషన్‌ను అమలు చేయడానికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని చెప్పారు. అసెస్‌మెంట్ నెంబరు కలిగి ఉన్న పూర్తి ఆస్తి భాగానికి టైటిల్ ట్రాన్స్‌ఫర్ చేయొచ్చని తెలిపారు. అలాగే నగరంలో పన్ను వసూళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఇప్పటి వరకూ పన్ను లేని ఆస్తులను గుర్తించి త్వరితగతిన వాటికి పన్ను విధించాలని స్పష్టం చేశారు. సమావేశంలో సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికతతో కేసుల మిస్టరీని ఛేదించాలి

● విద్యా సంస్థల్లో శక్తి వారియర్స్‌ను నియమించాలి

● ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పోలీసు స్టేషన్ల పరిధిలో నాన్ బెయిలబుల్ వారెంట్లు, పోయిన వాహనాలను, మిస్సింగ్ కేసులను, సైబర్ క్రైం, గంజాయి కేసులను సాంకేతికతను వినియోగించి ఛేదించాలని ఎస్పీ వకుల్ జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ పోలీసు స్టేషన్‌లలో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందితో శుక్రవారం జూమ్ మీటింగు నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంస్థల్లో శక్తి వారియర్స్ బృందాలను నియమించాలని, శక్తి యాప్ పట్ల అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమస్యలు పరిష్కరించే నేర్పుగల విద్యార్థినిని శక్తి లీడ్ వారియర్‌గా నియమించాలన్నారు. తరచూ నేరాలకు పాల్పడుతున్న నిందితులపై నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నాన్ బెయిల్ వారెంట్లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ౦ పరారీలో ఉన్న నిందితులను వెంటనే అరెస్టు చేయాలని ఎస్పీ ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలకు అవకాశం ఉన్న పాత భవనాలు, శివారు ప్రాంతాలను గుర్తించి నిఘా పెట్టాలన్నారు. ఈ జూమ్ సమావేశంలో ఏఎస్పీ సౌమ్యలత, డీఎస్పీలు శ్రీనివాసరావు, భవ్యారెడ్డి, వీరకుమార్, రాఘవులు, గోవిందరావు, సీఐలు లీలారావు, సుధాకర్, ఎస్ఐ ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.


జూమ్‌లో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఉపాధిలో అవినీతికి చెక్

● నిబంధనలు కఠినతరం

● పని ప్రదేశంలో రెండు విడతల హాజరు నమోదు

● శ్రామికుల ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్

గజపతినగరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం అమలులో అవినీతికి అడ్డుకట్ట వేసే దిశగా అడుగులు పడుతున్నాయి. దీని కోసం ప్రభుత్వం నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంస్) యాప్‌ను తీసుకువచ్చింది. దొంగ మస్తర్ల కట్టడికి కేంద్రం మరికొన్ని చర్యలు చేపట్టింది. ఇప్పటిదాకా ఉన్న నిబంధనలను మరింత కఠినతరం చేయడంతో పాటు సంబంధిత అధికారుల పర్యవేక్షణ బాధ్యతలను పెంచింది. ఉపాధి పనులకు సంబంధించి మస్తర్లలో నమోదు చేసిన శ్రామికులకు పని చేసే చోట రెండు పర్యాయాలు ఫొటోలు తీసి... ఆన్‌లైన్‌లో పొందుపరచాలి. ఉదయం పనికి రాగానే ఒకసారి... సాయంత్రం నాలుగు గంటల తరువాత మరోసారి ఫొటోలు తీసి... వాటిని నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. శ్రామికులకు వేతన చెల్లింపులకు ఫొటోలు తప్పనిసరి. ఏరోజుకారోజే పనికి హాజరైన వారి ఫొటోలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఒక రోజుకు సంబంధించిన ఫొటోలు తరువాతి రోజు అప్‌లోడ్ చేయడానికి వీలు పడదు. జిల్లాలో ఉపాధి హామీ జాబ్ కార్డుదారులు 3 లక్షల 86 వేల మంది ఉన్నారు. వేతనదారులు 6 లక్షల 88 వేల మంది. ప్రస్తుతం వీరిలో 5 లక్షల 72 వేల మంది వేతనదారులు పనులకు హాజరవుతున్నారని అధికారులు చెబుతున్నారు.

అమలు తీరు ఇలా...

గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు తీసే ఫొటోలను పంచాయతీ కార్యదర్శులకు అప్‌లోడ్ చేయాలి. వాటిని నిరంతరం కార్యదర్శులు పర్యవేక్షిస్తూ... ఎంపీడీఓలకు నివేదిక అందజేయాలి. ఎన్ని ఫొటోలు సక్రమంగా తీశారనేది మండల స్థాయి అధికారులు చెక్ చేయాలి. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వచ్చిన ఫొటోలకు సంబంధించి 20 శాతం వివరాలను జిల్లా అధికారులకు అప్‌లోడ్ చేయాలి. క్షేత్ర స్థాయిలో రెండోసారి ఫొటోలు తీయని ఫీల్డ్ అసిస్టెంట్, సీనియర్ మేట్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నారు. జిల్లా కార్యాలయాల్లో ప్రతి ఫొటోను జాగ్రత్తగా భద్రపరచాలి. ఈ ప్రక్రియలో అలసత్వం వహించే పంచాయతీ కార్యదర్శులు, మండల, జిల్లా అధికారులపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే మండల స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లకు యాప్‌పై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ యాప్ ద్వారా ఉదయం, సాయంత్రం రెండు పూటలా పనులు కల్పించే దిశగా అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. శ్రామికులకు వేతనం రావాలంటే ఏ పూటకాపూట ఫొటోలు తీసుకోవాల్సిందే. లేదంటే ఆరోజు వేతనం రానట్టే.

1 నుంచి అమలు

ఆగస్టు ఒకటో తేదీ నుంచి ఉపాధి హామీ పథకంలో శ్రామికులకు రెండు పూటలా ఫొటోలు తీస్తాం. క్షేత్ర స్థాయిలో ఫీల్డ్అసిస్టెంట్లు ఉదయం 9 గంటలకు, సాయంత్రం 4 గంటలకు ఫొటోలు తీసి..అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీనిపై పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణ ఉంటుంది. మండల, జిల్లా సాయి అధికారులకు కూడా ఫొటోలు పంపించాల్సి ఉంటుంది. దీనిపై అలసత్వం వహిస్తే ఫీల్డ్ అసిస్టెంట్లు, సీనియర్ మేట్లపై క్రమశిక్షణ చర్యలు తప్పవు.

- కృష్ణవేణి, ఏపీవో, గజపతినగరం


ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు

కల్తీ మద్యం కేసుపై లోతైన విచారణ జరపాలి

చీపురుపల్లి, జులై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అతి పెద్ద కుంభకోణంగా గుర్తించిన కల్తీ మద్యం స్కాంపై మరింత లోతైన విచారణ జరపాలని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు కోరారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. అక్రమాలకు పాల్పడాలన్న ఉద్దేశంతోనే 2019లో జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే లిక్కర్ పాలసీని మార్చారని గద్దే ఆరోపించారు. బటన్ నొక్కి ప్రజలకు లక్షలు పంచిన ఆయన బాటిల్ కొట్టి కోట్లు సంపాదించారని ఎద్దేవా చేశారు.

మంత్రికి కృతజ్ఞతలు

దత్తిరాజేరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): లో-ఓల్టేజీ సమస్యతో ఇబ్బంది పడుతున్న తమ గ్రామానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవతో సమస్య తీరిందని మరడాం పంచాయతీ మధుర గ్రామం అడవికొత్తవలస వాసులు తెలిపారు. తమ గ్రామంలో 20 సంవత్సరాల నుంచి లోటల్టేజీ సమస్య ఉండేదన్నారు. అయితే మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తమ గ్రామానికి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశా రన్నారు. ఈసందర్భంగా శుక్రవారం ఆ గ్రామస్థులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

వంద కంపెనీలు ఎక్కడ?

భోగాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో స్థానిక ఎమ్మెల్యే వంద రోజుల్లో వంద కంపెనీలు తీసుకొస్తామని చెప్పారని. వంద కంపెనీలు ఎక్కడ వచ్చాయని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ ప్రశ్నించారు. మండలంలోని సవరవల్లి, రావాడ, తూడెం, కవులవాడ, పోలిపల్లి, లింగాలవలస గ్రామాల్లో శుక్రవారం వైసీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భోగాపురం ఎంపీడీవోగా గాయత్రి

భోగాపురం, జూలై25(ఆంధ్రజ్యోతి): స్థానిక డిప్యూటీ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న గాయత్రికి పైఅధికారులు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఎఫ్ఏసీ ఎంపీడీవోగా గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. దీంతో ఆమె శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

వాసవీమాతకు చీరలతో అలంకరణ



జామి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జామిలో శ్రావణ శుక్రవారం పర్వదినం పురస్కరించుకుని కన్యకా వాసవీ పరమేశ్వరీ అమ్మవారికి చీరలతో అలంకరించారు. మండలంలోని ఆర్యవైశ్య మహిళలు కుటుంబాలతో వచ్చి పూజలు చేశారు.

నేడు మెగా జాబ్‌మేళా

భోగాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంజేరు సమీప మిరాకిల్ ఎడ్యుకేషన్ సొసైటీ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో శనివారం ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. ఈ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆర్టీసీ సౌకర్యానికి ఆమడ దూరంలో..

- భోగాపురం మండల వాసులకు తప్పని అవస్థలు
- మధ్యాహ్న భోజన సమయంలో మాత్రమే సర్వీస్‌రోడ్డులో హాల్ట్.. అదీ కిలోమీటరు దూరంలో
- మిగతా సమయాల్లో వంతెన దిగాల్సిందే..



భోగాపురానికి కిలోమీటరు ముందు సర్వీస్ రోడ్డులో నిలుపుదల చేసిన ఎక్స్‌ప్రెస్ బస్సు

భోగాపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): భోగాపురం మండల వాసులు ఆర్టీసీ సౌకర్యం లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో మాత్రమే భోగాపురం సర్వీస్‌రోడ్డులో ఎక్స్‌ప్రెస్ బస్సు ఆగుతుంది. అది కూడా స్టేజ్‌కు కిలోమీటరు ముందే(భోజన హోటల్స్ వద్ద). ఇదెక్కడి నిబంధన అంటూ ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జాతీయ రహదారి-5గా ఉన్నప్పుడు ప్రతి ఎక్స్‌ప్రెస్ బస్సు భోగాపురంలో ఆగి వెళ్లేది. దీంతో ప్రజలు విశాఖ, శ్రీకాకుళం వైపు నిరంతరం సులువుగా రాకపోకలు సాగించేవారు. జాతీయ రహదారి నాలుగు రోడ్లగా విస్తరణ చేయడం.. అవసరమైన చోట వంతెనలు ఏర్పాటు చేయడంతో భోగాపురానికి ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ సౌకర్యం లేకుండా పోయింది. దీంతో భోగాపురంవాసులకు అవస్థలు తప్పడం లేదు.

ప్రయాణికులు విశాఖలో ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కే ముందే.. ఇది భోగాపురం గుండా వెళ్లదని, వంతెన పైనుంచి వెళ్తుందని.. వంతెనపైనే దిగాల్సి వస్తుందని కండక్టర్లు చెబుతున్నారు. ప్రయాణికులు వేరే గత్యంతరం లేక ఎక్స్‌ప్రెస్ బస్సులు ఎక్కి వంతెనపై దిగుతూ అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్న భోజన సమయంలో మాత్రం విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లకు భోగాపురంలో స్టేజ్ ఉందని చెబుతూ ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. సర్వీస్‌రోడ్డులో వెళ్తూ భోగాపురానికి సుమారు కిలోమీటరుకు ముందే భోజన హోటల్స్ వద్ద సుమారు 30 నిమిషాల పాటు నిలుపుదల చేస్తున్నారు. భోగాపురంలో దిగాల్సిన ప్రయాణికులు 30 నిమిషాల పాటు వేచి ఉండలేక అక్కడ నుంచి మళ్లీ ఆటోకి రూ.10 ఇచ్చి భోగాపురం చేరుకుంటున్నారు. భోజన సమయంలో మినహాయించి అన్ని సమయాల్లో హైవే నుంచి వెళ్లడం ఏమిటని.. భోజన సమయంలో మాత్రం సర్వీస్ రహదారిలో వచ్చి స్టేజ్‌కి కిలోమీటరు ముందు నిలుపుదల చేయడం ఏమిటని కండక్టర్‌ని ప్రయాణికులు ప్రశ్నిస్తే.. ముందే చెప్పాం కదా.. ఎందుకు ఎక్కారని సమాధానం ఇస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులు నిరంతరం సర్వీస్‌రోడ్డుపై నుంచి రాకపోకలు సాగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు: ఎస్పీ



వినతులు పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించి, సిబ్బంది నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. పోలీసు వెల్ఫేర్ డేలో సిబ్బంది సమస్యలను, వినతులను స్వీకరించి వారి వ్యక్తిగత, వృత్తిపరమైన శాఖా పరమైన సమస్యలు గుర్తించి, వాటి పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపడతామన్నారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మెరకముడిదాం, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంఈవో ఎం.చంద్రశేఖర్ తెలిపారు. రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం దూర విద్యా విధానం 2025-26 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాల కోసం శుక్రవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈవో అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పరీక్షల నిర్వహణపై పోస్టర్ విడుదల చేశారు. ఈ ఏడాది ఆగస్టు 31న పదో తరగతిలో ప్రవేశం కోసం 14 సంవత్సరాలు, ఇంటర్‌లో ప్రవేశానికి 10వ తరగతి పూర్తయిన 15 సంవత్సరాలు నిండిన వారు అర్హులని తెలిపారు. ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు మెరకముడిదాం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంను సంప్రదించాలన్నారు. సందేహాల నివృత్తికి 9440982120, 9441947199 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులే జాతి నిర్మాతలు

- విద్యా శాఖ ఆర్‌జేడీ విజయభాస్కర్

నెల్లిమర్ల, జూలై 25(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులే జాతి నిర్మాతలని విద్యాశాఖ ఆర్‌జేడీ టి.విజయభాస్కర్ అన్నారు. నెల్లిమర్ల పట్టణ పరిధిలోని వేణుగోపాలపురం ప్రభుత్వ డైట్ కళాశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా కొత్తగా ఉపాధ్యాయ శిక్షణలో చేరిన ఛాత్రోపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యాభ్యాసమంటే కేవలం ర్యాంకులు, మార్కులు మాత్రమే కాదని, సత్ప్రవర్తన కూడా చదువులో ఒక భాగమని చెప్పారు. ప్రిన్సిపాల్ రామకృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ అప్పలనాయుడు, స్టాఫ్ సెక్రటరీ చిన్నంనాయుడు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పథకాల అమలుకు బ్యాంకుల సహకారం అవసరం

- ఎమ్మెల్యే కళావెంకటరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకటరావు

చీపురుపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించుకున్న సంక్షేమ పథకాల అమలుకు బ్యాంకుల సహకారం ఎంతో అవసరమని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బ్యాంకు అధికారులు, వివిధ శాఖల అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అర్హులకు ప్రభుత్వం అందించే పథకాల అమలులో అన్ని బ్యాంకుల సహకారం ఉండాలన్నారు. పట్టు పరిశ్రమకు గతంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి సాయం ఉండేదని, ప్రస్తుతం అది అమలు కావడం లేదని సంబంధిత అధికారి ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన ఆయన.. ఈ విషయంపై కలెక్టర్‌తో మాట్లాడతానన్నారు. ఈ సమీక్షలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజరు వీవీ రమణమూర్తి, ఎంపీడీవో ఇప్పలవలస సురేష్, బ్యాంకు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. కర్లాంలో రూ.21లక్షల ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో నిర్మించిన ఐదు సీసీ రోడ్లను ఆయన శుక్రవారం రాత్రి ప్రారంభించారు. పార్టీ నాయకులు కుచ్చర్లపాటి త్రిమూర్తులరాజు, రౌతు కామునాయుడు, దన్నాన రామచంద్రుడు పాల్గొన్నారు.

డ్రోన్ టెక్నాలజీ రైతులకు వరం

- ఎమ్మెల్యే లలితకుమారి



డ్రోన్ ఎగురవేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, జూలై 25(ఆంధ్రజ్యోతి): డ్రోన్ టెక్నాలజీ రైతులకు వరం లాంటిదని ఎమ్మెల్యే లలితకుమారి అన్నారు. రంగారాయపురం గ్రామంలో వ్యవసాయశాఖ అందించిన డ్రోన్‌ను ఆమె శుక్రవారం ప్రారంభించారు. డ్రోన్ వినియోగంతో రైతులకు సమయం, ఖర్చు ఆదా అవుతాయని తెలిపారు. అంతకముందు సంతపేట గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, ఏఎంసీ ఛైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, కొల్ల భూపాల్‌నాయుడు, ఏడీ భానులత, ఏవో వి.హరికృష్ణ పాల్గొన్నారు.

వ్యవసాయంలో డ్రోన్లు వినియోగించండి

కొత్తవలస, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంలో డ్రోన్లను వినియోగించుకోవాలని విజయనగరం రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ భారతి సూచించారు. శుక్రవారం సంతపాలెం రైతుసేవా కేంద్రంలో ఏవో కేవీ రాంప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని, డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించారు. వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రానికి శంకుస్థాపన



అగ్నిమాపక కేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

పూసపాటిరేగ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనాడ కూడలి సమీపంలో ఏర్పా టుచేయనున్న అగ్నిమాపక కేంద్రానికి ఎమ్మెల్యే లోకం నాగమాధవి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ తీర్చే అవకాశం లభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సుమారు 78 సెంట్ల ప్రభుత్వ స్థలంలో రూ.2.25కోట్ల అంచనా వ్యయంతో అగ్నిమాపక కేంద్రం నిర్మాణం జరగనుందన్నారు. ఈ కార్యక్రమానికి జనసేన నాయకులు హాజరు కాగా, టీడీపీ నాయకులు హాజరు కాకపోవడం విశేషం.

ప్రమాదాల నివారణకు చర్యలు

డెంకాడ, జూలై 25(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు స్థానిక పోలీసులు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో భోగాపురం రూరల్ సీఐ జి.రామకృష్ణ, స్థానిక ఎస్‌ఐ ఆరంగి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో రేడియం స్టిక్కర్లు కలిగిన టైర్లను ఏర్పాటు చేశారు. విజయనగరం నుంచి విశాఖపట్టణం వెళ్లే 26వ నెంబర్ జాతీయ రహదారిపై గల బ్లాక్స్ స్పాట్ ప్రాంతాల్లో రేడియం స్టిక్కర్లు కలిగిన 50 టైర్లను ఏర్పాటు చేశారు. ప్రమాదాల నివారణకు ఇవి సహకరిస్తాయని చెప్పారు.

తాగునీటి కోసం విద్యార్థుల ఇక్కట్లు

- పాతబగ్గాం పాఠశాలలో పాడైన ఆర్వో ప్లాంట్



మరమ్మతులకు గురైన ఆర్వో ప్లాంట్

గజపతినగరం జూలై 25(ఆంధ్రజ్యోతి): పాతబగ్గాం గ్రామంలోగల ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు తాగునీటికి ఇక్కట్లు పడుతున్నారు. పాఠశాలలో 113 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కింద సుమారు రూ.లక్షా 50వేలతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. అయితే ప్లాంట్‌కు సంబంధించి ఏర్పాటుచేసిన బోరు నుంచి తగినంత నీరు రావడం లేదు. అలాగే ఇటీవల ఆ ప్లాంట్ కూడా మరమ్మతులకు గురయ్యింది. దీంతో విద్యార్థులు తాగునీటి కోసం బయటకు వెళ్లాల్సి వస్తోంది.

ఏజెన్సీకి సమాచారం అందించాం

దీనిపై హెచ్‌ఎం సూర్యనారాయణను వివరణ కోరగా.. ప్లాంట్ పాడయ్యిందని, గతంలో ఏజెన్సీవాళ్లు వచ్చి ప్లాంట్‌ను ఏర్పాటు చేశారని, వారే వాటిని మరమ్మతులు చేయాలని తెలిపారు. ఏజెన్సీకి సమాచారం అందజేశామని చెప్పారు.

అధ్వానంగా పిల్లల పార్క్

- పట్టించుకోని అధికారులు



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న చిన్నపిల్లల పార్క్



జారుడు బల్ల, ఉయ్యాలలు ఇలా..

రాజాం, జూలై 25(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న చిన్నపిల్లల పార్క్ అధ్వానంగా తయారయ్యింది. ఈ పార్క్‌ని మున్సిపాలిటీ అధికారులు పట్టించుకోకపోవడంతో నిర్వాహణ లేక నిరుపయోగంగా మారింది. పార్కులో ఏర్పాటుచేసిన ఆట వస్తువులు శిథిలమయ్యాయి. జారుడు బల్లలు, ఉయ్యాలలు విరిగిపోయాయి. పార్క్ అంతా చెత్తతో దర్శనమిస్తోంది. పిచ్చిమొక్కలతో నిండింది. దీంతో చిన్నారులు ఆటలకు దూరం అవుతున్నారు. పార్క్ అభివృద్ధికి చొరవ చూపి మళ్లీ వినియోగంలోకి తీసుకు రావాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌అండ్‌బీ జాగా.. వేసేద్దాం పాగా

- ఆక్రమణల వలలో జామి-విజయనగరం ప్రధాన రహదారి



జామి-విజయనగరం రోడ్డును ఆనుకుని చేపడుతున్న నిర్మాణాలు

జామి, జూలై 25(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం జామి నుంచి విజయనగరం వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా ఆక్రమణదారుల సొంతం అయింది. రహదారికి ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాల్లో యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై పంచాయతీ, రోడ్లు భవనాల శాఖ అధికారులు కనీసం దృష్టి సారించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికే గ్రామంలో ఒక వ్యక్తి తన పలుకుబడితో డీపట్టా భూమిలో పెద్ద కమర్షియల్ నిర్మాణం చేపట్టాడు. దీనిపై అధికారుల మౌనం పలు అనుమానాలకు తావిస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.

నోటీసులు ఇస్తాం..

గతంలో కొందరు కొన్ని నిర్మాణాలు చేపట్టేందుకు ప్రయత్నిస్తే నోటీసులు ఇచ్చాం. మళ్లీ నిర్మాణాలు చేపడితే సిబ్బందిని పంపించి, నోటీసులు ఇస్తాం. నిర్మాణాలు చేపట్టకుండా చర్యలు తీసుకుంటాం.

- ప్రసాద్, పంచాయతీ ఈవో

తహసీల్దార్‌కు లేఖ రాశాం

ఇక్కడ ఆక్రమణదారుడికి నిర్మాణాలు ఆపాలని సూచిస్తే ఇక్కడ ఉన్న అన్ని నిర్మాణాలు తొలగిస్తే తాను తొలగిస్తానని చెబుతున్నాడు. ఇక్కడ ఆక్రమణ విషయంపై ఇప్పటికే తహసీల్దార్‌కు లేఖ రాశాం.

- ఉదయ్, రహదారుల శాఖ జేఈ

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



గోవిందరావు (ఫైల్)

రణస్థలం, జులై 25 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో ఒక భవన నిర్మాణంలో రాడ్ బెండింగ్ పనులు చేపడుతుండగా 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి నెల్లిమర్ల మండలం జగరాజుపేటకి చెందిన కె.గోవిందరావు (48) శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. రణస్థలానికి చెందిన అదపాక పైడిరాజు ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. రాడ్‌బెండింగ్ పనులు చేపడుతున్న సమయంలో భవనంపై ఉన్న 11కేవీ విద్యుత్ వైర్లు తగలడంతో గోవిందరావు విద్యుదాఘాతానికి గురయ్యాడు. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య సత్యవతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేఆర్‌పురం ఎస్‌ఐ ఎస్ చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాగెమ్మపేటలో చోరీ

వంగర, జులై 25 (ఆంధ్రజ్యోతి): బాగెమ్మపేట గ్రామంలోని ఓ ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనపై ఎస్‌ఐ షేక్‌శంకర్ శుక్రవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాగెమ్మపేటకు చెందిన శంకరరావు వారం రోజుల కిందట తన చిన్నకుమారుడు ఇంటికి హైదరాబాద్ వెళ్లారు. అయితే శుక్రవారం ఉదయం ఆ ఇంటి తాళాలు పగులగొట్టి ఉండడాన్ని ఎదురింటిలో నివాసం ఉంటున్నవారు గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా దుస్తులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. గురువారం రాత్రి చోరీ జరిగినట్టు గ్రహించి, శంకరరావుకు సమాచారం అందించారు. దీంతో శంకరరావు తమ్ముడు కృష్ణారావు తోపాటు పలువురు అక్కడకు చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లి చూసేసరికి బీరువాలో బంగారం, వెండి వస్తువులు కనిపించలేదు. బీరువాలోని 20 తులాల బంగారం, కొన్ని వెండి వస్తువులు అపహరణకు గురైనట్టు గుర్తించి పోలీసులకు తెలిపారు. పోలీసులు ప్రాథమిక దర్యాప్తు అనంతరం విజయనగరం క్లూస్ టీంకు సమాచారం అందించారు. దీంతో విజయనగరం క్లూస్‌టీం ఎస్‌ఐ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని, వేలిముద్రలు సేకరించారు. శంకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుత్ తీగల బారి నుంచి కాపాడండి



ఇళ్లపై వెళ్తున్న త్రిఫేజ్ విద్యుత్ వైర్లు చూపిస్తున్న స్థానికులు

జామి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జాగరం గ్రామంలో తమ ఇళ్లపై నుంచి త్రిఫేజ్ విద్యుత్ వైర్లు వెళ్తున్నాయని, వర్షం పడుతున్న సమయంలో గోడల్లో కరెంటు ప్రవహించి, షాక్ కొడుతోందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి, సరి చేయాలని కోరుతున్నారు.

జిందాల్ నిర్వాసితులకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

విజయనగరం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు కోరారు. నగరంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2006లో ఎస్.కోట సమీపంలో నాలుగు గ్రామాల పరిధిలో జిందాల్ అల్యూమినీయం పరిశ్రమ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారన్నారు. అసైన్డ్ భూములు, పట్టా భూమితో పాటు కొందరు రైతుల నుంచి జిరాయితీ భూమి పరిశ్రమ కోసం అందరికీ తెలిసిందేనన్నారు. జిందాల్ ఏర్పాటు కాకపోగా, ఇప్పుడు అక్కడ ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు ముందుకు వచ్చిందన్నారు. అయితే తాము పరిశ్రమలకు వ్యతిరేకం కాదని, దీనిని స్వాగతిస్తున్నామని చెప్పారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం రైతులకు న్యాయం చేసే విధంగా జిందాల్, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న నిరసన

శృంగవరపుకోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): బొడ్డవర గ్రామంలో జిందాల్ నిర్వాసితులు శుక్రవారం సీపీఎం జిల్లా నేత చల్లా జగన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎంఎస్‌ఎంఈ పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఈ ప్రాంత యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు.

అంత్యక్రియలకు సాయం

జామి, జూలై 25(ఆంధ్రజ్యోతి): విజినిగిరి గ్రామంలో ఆరిపాక అప్పాలు భార్య పార్వతమ్మ శుక్రవారం మృతిచెందింది. అంత్యక్రియలు చేసేందుకు అప్పాలు వద్ద డబ్బులు లేకపోవడంతో గ్రామంలో ఉన్న హెల్పింగ్ హ్యాండ్స్ బృందం స్పందించింది. ఆ కుటుంబానికి రూ.21వేలు సాయం చేసింది. ఈ కార్యక్రమంలో హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు ఇజ్జాడ సత్యనారాయణ, నడిపేన చిన్న సత్యనారాయణ, కుసుమంచి శ్రీను, కిలారి కిరణ్, బోజరాజు హరినాయుడు, విజినిగిరి రవి పాల్గొన్నారు.

లాకౌట్ ఎత్తివేయాలని పూజలు



పూజలు చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

కొత్తవలస, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మూతపడిన జేఎస్‌ఎల్ కర్మాగారాన్ని తెరిపించాలని టీఎన్‌టీయూసీ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు లెంక శ్రీను కోరారు. అప్పన్నపాలెం పంచాయతీ జేఎస్‌ఎల్‌నగర్‌లో ఉన్న జిందాల్ కర్మాగారానికి చెందిన కార్మికులు శుక్రవారం ఆయన ఆధ్వర్యంలో తుమ్మికాపల్లి బ్రిడ్జి సమీపంలోనున్న దుర్గాదేవి గుడిలో పూజలు చేశారు.

అరకు రోడ్డులో వెళ్లే డ్రైవర్లకు రక్షణ కల్పించండి

శృంగవరపుకోట, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అరకు ఘాట్ రోడ్డులో విధులు నిర్వహిస్తున్న ఎస్.కోట ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్లకు రక్షణ కల్పించాలని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక డిపో గేటు వద్ద ధర్నా చేశారు. డిపో కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 6న గన్నెల కూడలి వద్ద కారులో వచ్చిన పది మంది ఒడిశా వాసులు.. డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేశారన్నారు. అరకు పోలీసులు వచ్చేసరికి పరారయ్యారన్నారు. ఈ ఘటన జరిగి 20 రోజులు అయ్యిందన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసినప్పటికీ ఇంతవరకు దోషులను పట్టుకోలేదన్నారు. డిపో అధ్యక్షుడు కేజీ నాయుడు, గ్యారేజీ కార్యదర్శి ఎస్ఏ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రాజాం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మున్సిపాల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది మార్చిలో పదవీ విరమణ చెందిన ఉద్యోగులు, మరణించిన మున్సిపల్ కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చి, ఆదుకోవాలని డిమాండ్ చేశారు, అలాగే రాష్ట్ర ప్రభుత్వం పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులకు గతంలో ఇచ్చిన హామీలైనా పదవీ విరమణ బెనిఫిట్ రూ.75వేలు, ఎక్స్‌గ్రేషియా రూ.5లక్షల నుంచి రూ.7లక్షల పెంపు, దహన సంస్కారాలకు ఖర్చులు రూ.15వేల నుంచి రూ.20వేలకు పెంపు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. గత సమ్మె కాలపు ఒప్పందాలు, సంక్షేమ పథకాల అమలు విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే కార్మికుల నిర్ణయం మేరకు ఆందోళన చేపడతామని చెప్పారు. మున్సిపాల్ యూనియన్ నాయకులు పి.రాజేష్, చిన్నబాబు, రవి, రఘు తదితరులు పాల్గొన్నారు

చెన్నై సెమినార్‌లో పాల్గొన్న భూదేవి

పాలకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): చెన్నైలో మద్రాస్ క్రిస్టియన్ కాలేజ్ ఆధ్వర్యంలో వికసిత్ భారత్-2047 సామాజిక న్యాయం, ఆదివాసీ హక్కులు అనే అంశంపై శుక్రవారం జరిగిన సెమినార్‌లో నారీశక్తి అవార్డు గ్రహీత పడాల భూదేవి పాల్గొన్నారు. ఆదివాసీలపై సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. గిరిజన చట్టాలు ఉన్నప్పటికీ అవి అమలు కావడం లేదన్నారు. 1/70, పీసా, ఆవోఎఫ్ఆర్ వంటి చట్టాలు సక్రమంగా అమలు జరగడం లేదన్నారు.

సారా హోరు.. బెల్టు జోరు!

(5వ పేజీ తరువాయి)

అమ్మకాలు కూడా జోరుగా సాగుతున్నాయి. కొంతమంది వ్యాపారులు సీతంపేటతో పాటు చుట్టు పక్కల గిరిజన గ్రామాల్లో నాటుసారా తయారీ, విక్రయాలు, రవాణా వంటివి చేపడుతున్నారు. సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం ఇతరాత్ర సరుకులను కొందరు బహిరంగంగానే విక్రయిస్తున్నారు. ఏదేమైనా ఏజెన్సీలో ఒక పక్క నాటుసారా.. మరోపక్క బెల్టు షాపులు పుట్ట గొడుగుల్లా వెలుస్తున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.లక్ష కడితే చాలా?

సీతంపేట మన్యంలో గొలుసు దుకాణాలకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఒక్కో మద్యం బాటిల్‌పై వచ్చే ఆదాయం ఎక్కువగా ఉండడంతో బెల్ట్‌షాప్‌ల నిర్వహణకు వ్యాపారులు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే ఏజెన్సీలో ఏ గ్రామంలోనైనా బెల్ట్ దుకాణం పెట్టాలనుకునే వారు ముందుగా మద్యం దుకాణం నడుపుతున్న సిండికేట్ వ్యాపారులను కలవాల్సి ఉంటుంది. వారి అనుమతితో రూ.1లక్ష అడ్వాన్స్‌గా చెల్లించాల్సి ఉంటుంది. ఇదే కాకుండా గొలుసు దుకాణంలో స్టాక్ పెట్టుకోవడానికి మరో లక్ష కట్టాలి. అప్పుడే సంబంధిత మద్యం దుకాణం నుంచి బాటిళ్లను సరఫరా చేస్తారు. ఇలా ఏజెన్సీలో చాపకింద నీరులా ఈ దందా సాగుతోంది. ఈ ఏడాది జనవరిలో పండగ సీజన్ సందర్భంగా దోనుబాయిలో బెల్ట్ దుకాణాలకు మద్యం తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు సీజ్ చేశారు. బాధ్యులపై కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి మారడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ వాసులు కోరుతున్నారు.

ఎక్సైజ్ ఏఈఎస్ ఏమన్నారంటే...

'బెల్ట్‌షాప్‌ల నిర్వహణ చట్టపరంగా నేరం. అటువంటి దుకాణాలపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తాం. వాటి నియంత్రణకు ప్రత్యేక డ్రైవ్ చేపడతాం. నాటుసారా నిర్మూలనే లక్ష్యంగా అనేక కార్యక్రమాలు చేపడతాం.' అని జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనాథుడు తెలిపారు.

టార్గెట్ 2027

(5వ పేజీ తరువాయి)

జాయింట్ ఎల్‌పీఎం (ల్యాండ్ పార్శిల్ మ్యాప్) ఇవ్వడం వల్ల రైతుల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. అయితే ఇటువంటి తప్పిదాలన్నీ సరిచేయాలని కూటమి ప్రభుత్వం జిల్లా రెవెన్యూ, సర్వే అధికారులకు విధి విధానాలు అందించింది. కాగా ఈ ఏడాదిలో రెండు విడతలు రీసర్వే నిర్వహించారు. మొదటి విడతలో పైలెట్ ప్రాజెక్టు కింద 15 గ్రామాల్లోని 8,910.82 ఎకరాల్లో రీ సర్వే చేపట్టారు. రెండో విడతలో 30 రెవెన్యూ గ్రామాల్లోని 27,542.23 ఎకరాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేశారు. మొత్తంగా రెండు విడతల్లోని జిల్లాలో 289 గ్రామాల్లో రీసర్వే పూర్తయినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇంకా 589 గ్రామాల్లో రీసర్వే జరగాల్సి ఉంది.

పరిష్కరిస్తాం..

రీసర్వే ద్వారా వాస్తవ భూవిస్తీర్ణం తేల్చి రైతులకు అప్పగిస్తాం. జాయింట్ ఎల్‌పీఎంలు ఉన్న వారు ఇబ్బందులు పడకుండా చూస్తాం. ఇటువంటి రైతులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే కచ్చితంగా పరిష్కారం చూపిస్తాం.

-పి.లక్ష్మణరావు, ఏడీ, జిల్లా సర్వే శాఖ, పార్వతీపురం మన్యం

స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్

సాలూరు, జూలై 25(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మామిడిపల్లి జంక్షన్ శుక్రవారం ఎంవీఐ ప్రసాదరావు స్కూల్ బస్సులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనిఫాం ధరించనందుకు, స్కూల్ బస్సుల్లో ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేనందున మూడు బస్సులకు రూ.1800ల జరిమానా విధించారు. రోడ్డుపై సురక్షిత డ్రైవ్‌కు సూచనలు జారీ చేశారు. పిల్లల భద్రత కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

విద్యుత్ శాఖ డీఈగా ప్రసన్నకుమార్

సాలూరు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సాలూరు ఏపీఈపీడీసీఎల్ డీఈగా ప్రసన్నకుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఈగా పనిచేసిన రంగారావు పార్వతీపురం బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విజయనగరం జిల్లా దాసన్నపేట ఏఈగా పనిచేస్తున్న ప్రసన్న కుమార్‌కు పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు.

చురుగ్గా ఫీవర్ సర్వే

సాలూరు రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మామిడిపల్లి పీహెచ్‌సీ పరిధిలో శుక్రవారం చురుగ్గా ఫీవర్ సర్వేను నిర్వహించారు. సాలూరు వైద్యశాఖ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డి.శివకుమార్ ఆదేశాల మేరకు గ్రామాల్లో వ్యాధుల పరిస్థితిపై సర్వే చేపట్టారు. దత్తివలస, కోదుకరకవలసలో వైద్య సిబ్బంది మానేపల్లి సాయిమురళి తదితరులు ఈ సర్వేలో పాల్గొన్నారు. కొత్తవలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, మామిడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు

పార్వతీపురం టౌన్, జూలై25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు అమ్మవారి ఆలయాల్లో శ్రావణ తొలి శుక్రవారం పురస్కరించుకుని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజాము నుంచి ప్రధాన రహదారిలోని పార్వతీదేవి ఆలయంతో పాటు కన్యాకాపరమేశ్వరి దుర్గాదేవి ఆలయాలకు మహిళలు పోటెత్తారు. కంకుమార్చనల్లో పాల్గొన్నారు.

కార్యదర్శులు బాధ్యతగా పనిచేయాలి

సాలూరు, జూలై25 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న సచివాలయ కార్యదర్శులు బాధ్యతగా విధులు నిర్వహించాలని ఇన్‌చార్జి కమిషనర్ శివప్రసాద్ ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ కార్యదర్శులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ-4 సర్వేను పక్కాగా నిర్వహించాలన్నారు. పీజీఆర్ఎస్ వినతులను సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ సూచించారు.

కోడిపందేలపై దాడి

సీతానగరం, జూలై25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తామరకండి శివారులో నిర్వహిస్తున్న కోడి పందేలపై శుక్రవారం ఎస్ఐ ఎం.రాజేశ్ దాడి చేశారు. కోడి పందేలు ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసకున్నారు. ఐదు కోడి పుంజులు, రూ. 17,300 నగదును స్వాధీనం చేసుకుని వారిపై ఎస్ఐ కేసు నమోదు చేశారు.

సారా పట్టివేత

వీరఘట్టం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హుస్సేన్‌పురంలో శుక్రవారం నిర్వహించిన దాడుల్లో 20 లీటర్ల పట్టుబడిందని ఎస్ఐ జి.కళాధర్ తెలిపారు. ఎవరైనా సారా తయారీ చేసినా, అమ్మినా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ స్థానికులను హెచ్చరించారు.

ఏసీబీ వలకు చిక్కిన అటవీశాఖ అధికారి

● మంచం కింద గుట్టలుగా నోట్ల కట్టలు, బంగారం బిస్కెట్లు గుర్తింపు

రాయగడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కొరాపుట్ జిల్లా జైపూర్ ఎన్‌కేటీ రోడ్డు పీఆర్ పేటలోని అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ రామచంద్ర నెపాక్ నివాసంపై శుక్రవారం అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడి చేశారు. సుమారు రూ. కోటిన్నరకు పైగా ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్టు గుర్తించారు. దాడుల్లో నెపాక్ ఇంట్లో మంచం కింద గుట్టలుగా పేరుకుపోయిన నోట్ల కట్టలు, బంగారు బిస్కట్లను కనుగొన్నారు. దాడుల్లో రూ.1.43 కోట్ల నగదు, రూ.1.33 కోట్ల బ్యాంకు డిపాజిట్లు, 1.5 కిలోల బంగారం, 4.6 కిలోల వెండి, బహుళ అంతస్తుల భవనం, 3 ఫ్లాట్స్, 2 అత్యంత ఖరీదైన ప్లాట్స్, 2 కార్లను గుర్తించారు. నెపాక్ అతడి బంధువుల ఇళ్లపై ఆరు చోట్ల ఏకకాలంలో దాడులు చేసి ఆదాయానికి మించిన ఆస్తులను గుర్తించారు.

ఒడిశా



ఏసీబీ అధికారులు గుర్తించిన నోట్ల కట్టలు

వచ్చేనెలలో రెండు సంక్షేమ పథకాలు

●ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి

కొమరాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా వచ్చే నెలలో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పథకాలను ప్రారంభిస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. పెద్దశాఖ, మసిమండ గ్రామాల్లో జలజీవన్ మిషన్ తాగునీటి ట్యాంక్‌లను శుక్రవారం ఆమె ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. తర్వాత తుమ్మలవలసలో చింతల పోలమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు శేఖర్ పాత్రుడు, సుదర్శనరావు, మధుసూదనరావు, గౌరీశంకరరావు, తెంటు శ్రీకర్, డి.సురేష్, శ్రీను, రాఘవ, కృష్ణంనాయుడు, బత్తిలి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

●కొమరాడ: ఆసుపత్రిలో ప్రతిక్షణం రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండల పర్యటనలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం హాజరు పట్టికను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం జిల్లా వైద్యాధికారితో ఫోన్‌లో మాట్లాడి పలు సూచనలు చేశారు. తూర్పుకాపు అభివృద్ధి డైరెక్టర్, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శేఖర్ పాత్రుడు, ఏఎంసీ వైస్ చైర్మన్ గౌరీశంకరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి సుదర్శనరావు, జనసేన మండల అధ్యక్షుడు తెంటు శ్రీకర్, బీజేపీ మండల అధ్యక్షుడు ద్వారపురెడ్డి సురేష్, వి.రాఘవ, ఎంవెంకటనాయుడు పాల్గొన్నారు.



సంక్షేమ కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

నేషనల్ స్పోర్ట్స్ వర్సిటీకి విద్యార్థుల ఎంపిక

బెలగాం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మణిపూర్ రాష్ట్రం ఇంఫాల్‌లోని నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి ఇద్దరు జిల్లా విద్యార్థులు ఎంపికయ్యారు. తైక్వాండో క్రీడకు ఎస్.జితేష్, ఫెన్సింగ్ క్రీడకు చైతన్య జోషి రాష్ట్రం నుంచి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం కోచ్ అనిల్‌శర్మతో కలిసి విద్యార్థులు కలెక్టర్ శ్యాంప్రసాద్‌ను కలిశారు. కలెక్టర్ వారిని అభినందించారు. రాష్ట్రం నుంచి మన జిల్లా విద్యార్థులు నేషనల్ స్పోర్ట్స్ యూనివర్సిటీకి ఎంపిక కావడం గర్వకారణమని కలెక్టర్ కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కలెక్టర్‌ను కలిసిన విద్యార్థులు

పోలీసుల సంక్షేమమే ధ్యేయం

బెలగాం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది సమస్యలు పరిష్కరించి వారి సంక్షేమానికి కృషి చేస్తామని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల నుంచి ఎస్పీ వినతులు స్వీకరించారు. సమస్యలు విని పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని వివిధ హోదాల్లో పని చేస్తున్న పోలీస్ సిబ్బంది, అధికారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఉద్యోగులకు వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి గ్రీవెన్స్ డే నిర్వహిస్తు న్నామన్నారు. కార్యక్రమంలో సీసీ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వినతులను స్వీకరిస్తున్న ఎస్పీ

కార్డన్‌సెర్చ్‌లో అనుమానితుల గుర్తింపు

కురుపాం, జూలై25 (ఆంధ్రజ్యోతి): గంజాయి, మద్యం సేవించే వారి నిమిత్తం శుక్రవారం పూతికవలస జంక్షన్‌లో నిర్వహించిన కార్డన్‌సెర్చ్‌లో ఇద్దరు అనుమానిత వాహనదారులను అదుపులోకి తీసుకున్నట్లు ఎల్విన్‌పేట సీఐ హరి తెలిపారు. అనుమానిత ప్రాంతాలు, పాడుబడిన భవనాలు క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. ఈ సందర్భంగా రెండు మోటార్ సైకిల్స్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు అనుమానస్పదంగా వ్యవహరించడం, సరైన పత్రాలు చూపకపోవడంతో అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.



వాహనాలను తనిఖీ చేసున్న సీఐ

పార్వతీపురం పట్టణంలో ..

●బెలగాం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల రక్షణ, భద్రత, మాదకద్రవ్యాల రవాణా నిర్మూలనే లక్ష్యంగా పార్వతీపురం పట్టణంలో సీఐ మురళీధర్, గోవిందరావు ఆధ్వర్యంలో శుక్రవారం వేకువజామున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నేర నియంత్రణ, గంజాయి, సారా, మద్యం రవాణా, నిల్వలు గుర్తించేందుకు 170 ఇళ్లల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వీఆర్వోల సమన్వయంతో మూడు బృందాలలుగా ఏర్పడి ఈ కార్డన్ సెర్చ్ నిర్వహించినట్టు పోలీసులు తెలిపారు. పాత నేరస్తులపై నిఘా ఉంచి వారి జీవన విధానం, నడవడికపై ఆరా తీశామన్నారు. ఈ సందర్భంగా పలు వాహన రికార్డులను పరిశీలిం చారు. జియ్యమ్మవలస మండలంలోని బొడ్డవలసలో ఎస్ఐ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో సీతానగరం ఎస్ఐ రాజేష్, టౌన్ ఎస్ఐ జగదీశ్ నాయుడు, గోవింద్, రూరల్ ఎస్ఐ సంతోషి తదితరులు పాల్గొన్నారు.

'కొఠియా' సమస్యను పరిష్కరించండి

సాలూరు/రూరల్, జూలై25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, ఒడిశా మధ్య వివాదంలో ఉన్న కొఠియా గ్రూప్ గ్రామాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీపీఎం, గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేశారు. వారు శుక్రవారం రాష్ట్రమంత్రి సంధ్యారాణి క్యాంప్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు.



మాట్లాడుతున్న గిరిజన సంఘ నాయకులు

ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, గిరిజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎస్. అప్పారావు తదితరులు మాట్లాడారు. కొఠియా సమస్యను పరిష్కరించడానికి కేంద్రప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకోవాలని కోరారు. ఏపీ అభివృద్ధి కార్యక్రమాలపై ఒడిశా దాడులను నిలువరించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ, సీపీఎం నేతలు ఎస్.వై.నాయుడు, కోరాడ ఈశ్వరరావు, మర్రి శ్రీనివాసరావు, సుబ్బారావు, కొంబులు, సన్నం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

పాలకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 4, 5 వార్డుల్లో తాగునీటి సమస్యను ఎప్పుడు పరిష్కరిస్తారో అధికారులు చెప్పాలని నగర పంచాయతీ సమావేశంలో కౌన్సిలర్లు గంగునాయుడు, వెలమల మన్మథరావు అధికారులను నిలదీశారు. స్థానిక నగర పంచాయతీలో శుక్రవారం నగర పంచాయతీ చైర్‌పర్సన్ ఆకుల మల్లీశ్వరి అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రత్నంరాజు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేటు కొళాయిలు వేసినప్పుడు సంబంధిత కౌన్సిలర్‌కు సమాచారం ఇచ్చి కొళాయిలు వేయాలని సమావేశం దృష్టికి పలువురు కౌన్సిలర్లు సూచించారు. బజారులో ఉన్న పలు షాపులు తక్కువ అద్దెకు పొంది అధిక ధరలకు వేరే వ్యక్తులకు బినామీలుగా అద్దెలకు ఇస్తున్నారన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని పలువురు కౌన్సిలర్లు నిలదీశారు. దీనిని పరిశీలిస్తామని కమిషనర్ తెలిపారు. ట్రాక్టర్ల మరమ్మతులకు నిధులు మంజూరు చేయడం పట్ల కొంచాడ అరుణ్‌కుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. వైస్ చైర్మన్ పల్లా ప్రతాప్, హనుమంతురావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కౌన్సిలర్లు

ఎరువుల కోసం ఆందోళన

కురుపాం, జూలై25 (ఆంధ్రజ్యోతి): కురుపాంలో శుక్రవారం ఎరువుల కోసం రైతులు ఆందోళన చేశారు. స్థానిక మన గ్రోమోర్ దుకాణానికి దాదాపు 260 బస్తాలు గురువారం సాయంత్రం స్టాక్ వచ్చినప్పటికి శుక్రవారం ఉదయానికే పంపిణీ పూర్తికావడంతో వారు దుకాణం ఎదుట ఆందోళన చేపట్టారు. మేనేజర్ రమేశ్‌ను నిలదీశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ మా దుకాణంలో రెగ్యులర్‌గా కొనుగోలు చేస్తున్న రైతులకే ఎరువులను విక్రయించామన్నారు. ఎరువులు వచ్చిన వెంటనే రైతులకు అందజేస్తామన్నారు. అలాగే కురుపాం-2 సచివాలయంలో ముందుగా ఆన్‌లైన్ చేసుకున్న రైతులకు కాకుండా ఆన్‌లైన్ చేసుకోని రైతులకు ఎరువులు అమ్మకాలు చేపట్టడంపై రైతులు వ్యవసాయ అధికారులకు నిలదీశారు. కొత్తగా ఇక్కడ విధుల్లో చేరిన అగ్రికల్చర్ అసిస్టెంట్‌కు తెలియకపోవడంతో పట్టాదారు పాస్‌పుస్తకాలు ఉన్నవారికి అమ్మకాలు చేసేశారన్నారు. ఆన్‌లైన్ చేసిన వారికి అందలేని సెక్రటరీ జగదీష్ తెలిపారు.



ఆందోళన చేస్తున్న రైతులు

అసంక్రమిత వ్యాధులపై సర్వే

పార్వతీపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అసంక్రమిత వ్యాధుల వ్యాప్తి ప్రభావం అంచనా, నియంత్రణకు వైద్యఆరోగ్యశాఖ పటిష్టంగా చర్యలు చేపట్టనుందని జిల్లా ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు అన్నారు. ఇందుకు సంబంధించి మూడు రోజుల పాటు మంగళగిరిలో నిర్వహించిన రాష్ట్ర ఎన్‌సీడీ వర్క్‌షాప్‌కు జిల్లా నుంచి వైద్య బృందం హాజరయ్యారు. శుక్రవారంతో ముగిసిన వర్క్‌షాప్ ఉద్దేశాన్ని న తెలిపారు.కార్యక్రమంలో ఎపిడమియాలజిస్ట్ డాక్టర్ కె.సూర్యకౌశిక్, ఎన్‌సీడీ కో-ఆర్డినేటర్ డాక్టర్ సునీల్‌కుమార్, ఎఫ్ఎల్‌సీ ఎస్.సాయిరమణి, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ కృష్ణారావు హాజరయ్యారన్నారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును ఎమ్మెల్యే విజయచంద్ర శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్వతీపురం నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను వివరించి నిధులు విడుదల చేయాలని కోరారు. ఇటీవల నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు, ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం విజయవంతం చేసినట్టు తెలిపారు. నియోజకవర్గంలో 87.97 శాతం అభివృద్ధి కార్య క్రమాలు నిర్వహించి ఎమ్మెల్యేగా మంచి ర్యాంకు సాధించినందుకు విజయ్‌చంద్రను సీఎం అభినందించారు. అనంతర రాష్ట్ర మంత్రి లోకేశ్‌ను ఎమ్మెల్యే విజయచంద్ర కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి కావాల్సిన నిధులు తదితర అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లతో ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్

పార్వతీపురం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురంలో త్వరలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డి హామీ ఇచ్చారు. అందుకు రూ.8 కోట్లను మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతిలో మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డిని ఎమ్మెల్యే విజయచంద్ర కలిశారు. పార్వతీపురంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం ప్రస్తావించగా అందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. స్పోర్ట్స్ కాంప్లెక్స్‌కు సంబంధించిన చర్యలు పూర్తయ్యాయని, త్వరలో నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యేకు మంత్రి హామీ ఇచ్చారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే

●పార్వతీపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): అమరావతి పర్యటనలో భాగం గా శుక్రవారం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర.. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలో పోలీస్‌స్టేషన్లకు వసతుల కల్పనకు నిధులు కేటాయించాలని కోరారు. గంజాయి, సారాను పూర్తిగా అరి కట్టాలని కోరారు. అందుకు డీజీపీ సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండండి

సీతంపేట రూరల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పాలకొండ డీఎస్పీ రాంబాబు సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీతంపేట ఎస్ఐ అమ్మనరావు ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఎస్పీ హాజరై విద్యార్థుల వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం పార్వతి, ఏఎస్ఐ సంజీవరావు పాల్గొన్నారు.

జీపీఎఫ్ నెంబర్లను కేటాయిస్తాం

పార్వతీపురం, జూలై 25(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పురపాలక సంఘాల పరిధిలో పనిచేస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులకు జీపీఎఫ్ నెంబర్లు కేటాయించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేసినా పాలకులు పట్టించుకోవడం లేదని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరాపు సూర్యనారాయణ అన్నారు. ఆ నెంబర్లను తీసుకువచ్చే బాధ్యతను పీఆర్‌టీయూ తీసుకుంటుందన్నారు. శుక్రవారం పట్టణంలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో వివిధ సమస్యలపై ఆయన సమావేశాలు నిర్వహించారు. తవిటినాయుడు, విజయ్, రామ్‌నాయుడు, శ్రీనివాసరావు, ప్రసాదరావు పాల్గొన్నారు.

శక్తియాప్‌పై అవగాహన

పాలకొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతకు శక్తియాప్ ఎంతో దోహదపడుతుందని శక్తి టీమ్ బృంద సభ్యులు చింతాడ పద్మతాంబ, రాము, గణేశ్ అన్నారు. ఎం.సింగుపురం హైస్కూల్‌ల శుక్రవారం సైబర్ క్రైంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.